క్లుప్తంగా

కలుషిత నీరు సరఫరా చేయొద్దు



పైప్‌లైన్ మరమ్మతులను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

గుంతకల్లుటౌన్: పట్టణంలోని సీఐటీయూ, పంప్‌హౌస్, రోటరీ హైస్కూల్ రైల్వే ట్రాక్‌ల వద్ద తాగునీటి పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ మల్లికార్జున వాటర్ వర్క్స్ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం ఉదయం ఆయన ఏఈ హరికృష్ణతో కలిసి ఆయా వార్డుల్లో పర్యటించారు. కలుషిత నీరు సరఫరా కాకుండా చూడాలన్నారు. నీటి సమస్యలపై అందిన ఫిర్యాదులపై వెంటనే స్పందించాలన్నారు.

నేడు ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం-1 సమీపంలోని మార్కెట్ యార్డు ప్రహరీ నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి భూమిపూజ చేస్తారని పార్టీ మండల కన్వీనర్ ఎద్దుల శరభారెడ్డి తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి మండలంలోని కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

బదిలీ పోలీసులకు సన్మానం



పోలీసులను సత్కరిస్తున్న సీఐ సుబ్రహ్మణ్యం

యల్లనూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్‌కానిస్టేబుల్ సాంబశివరావు, కానిస్టేబుళ్లు చంద్రశేఖర్, ప్రేమ్‌నాథ్‌రెడ్డి యాడికి, తాడిపత్రి టౌన్ పోలీస్‌స్టేషన్లకు బదిలీ అయ్యారు. సోమవారం పోలీస్‌స్టేషన్‌లో వీరిని పుట్లూరు సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో సత్కరించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సంపత్, శ్రీనివాస్‌గౌడ్, హెడ్ కానిస్టేబుల్ వెంకటరాముడు, కానిస్టేబుళ్లు రవీంద్రా రెడ్డి, వీర, మారుతీ, నాగరాజు, నవీన్, అక్కులప్ప, హోంగార్డు రామనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా బాలమ్మ



యాడికి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న బాలమ్మ ఉన్నతాధికారుల ఆదేశాలతో సోమవారం ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న అలెగ్జాండర్ సాధారణ బదిలీల్లో భాగంగా తాడిపత్రికి బదిలీ అయ్యారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



భూమిక, సంధ్య



సుధీర్

గుత్తి రూరల్: మండలంలోని ఇసురాళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్, బాడ్మింటన్ పోటీలకు ఎంపికై నట్లు పీడీ దాదాఖలందర్ తెలిపారు. సోమవారం అనంతపురం నగరంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ సెలెక్షన్స్‌లో ఇసురాళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదవుతున్న టి.భూమిక, కె.సంధ్య ఎంపికయ్యారన్నారు. అదే విధంగా పదో తరగతి చదువుతున్న డీ.సుధీర్ రాష్ట్ర స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థులను హెచ్ఎం శారద, పీడీ దాదాఖలందర్ అభినందించారు.

నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో సత్తా



ప్రశంసాపత్రాలను చూపుతున్న విద్యార్థులు

తాడిపత్రిటౌన్: నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో తాడిపత్రి విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని జిల్లా జేఎస్‌కేఎస్ జనరల్ సెక్రటరీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇటీవల గుంటూరు జిల్లా మంగళగిరిలో 8వ నేషనల్ ఇనిస్టిట్యూషనల్ కరాటే చాంపియన్‌షిప్ జరిగిందన్నారు. ఈ పోటీల్లో దాదాపు 450 మంది కరాటే క్రీడాకారులు పాల్గొన్నారు. తాడిపత్రికి చెందిన 11 మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి మెడల్స్ సాధించారన్నారు. రాగశ్రీ షబీనా, భరద్వాజ్, మనోహర్, నరసింహ గోల్డ్‌మెడల్స్ సాధించారు. రాగశ్రీ నిషాంత్ కుమార్ రెడ్డి, నరసింహ సిల్వర్ మెడల్స్, మహాలక్ష్మీ, సబీనా, మనోజ్‌రెడ్డి, గ్రీస్మంత్, మనోహర్‌రెడ్డి, వెంకటసాయిరెడ్డి బ్రాంజ్ మెడల్స్ దక్కించుకున్నట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యం



ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పామిడి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో అన్ని వర్గాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక రహమత్ ఫంక్షన్ హాల్‌లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం జగన్‌తోనే పేదల అభ్యున్నతి సాధ్యమన్నారు. ప్రజాసంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీల్లో 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత జగన్‌కే దక్కుతుందని కొనియాడారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సీఎం జగన్ సర్కారు పాలన కొనసాగిస్తోందన్నారు. ఎన్నికలప్పుడు మాత్రమే టీడీపీకి ప్రజలు గుర్తుకు వస్తారన్నారు. మోసపూరిత హామీలిచ్చే టీడీపీ అధినేత, ఆల్‌ఫ్రీ బాబు, దత్తపుత్రుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయన్నారు. బాబు హయాంలో ప్రజలకు మేలు జరగలేదని తెలిపారు. టీడీపీ హయాంలో చెప్పుకోదగిన పథకాలు లేవన్నారు. సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం సాధించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్తున్న వైఎస్ జగన్‌ను మరోసారి సీఎంగా ఆశీర్వదించాలన్నారు. సచివాలయాల వారీగా త్వరలో చేపట్టే వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమానికి అందరూ సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమంలో సచివాలయాల కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలు భాగస్వాములు కావాలన్నారు. వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు, మండల ఇన్‌చార్జ్ జానకిరామిరెడ్డి, పట్టణ, రూరల్ కన్వీనర్లు జోజుడే కుమార్, కే.నారాయణరెడ్డి, పట్టణ, రూరల్ సచివాలయాల కన్వీనర్లు బి.ఆసిఫ్, ఎం.కుమార్ రెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, మాజీ సింగిల్‌విండో ప్రెసిడెంట్ చుక్కలూరు రామకృష్ణారెడ్డి, బోయ రామచంద్ర, అనుంపల్లి సూరి, అన్వర్‌బాషా, అబ్దుల్‌రజాక్, హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత..

పామిడి: మండలంలోని రామగిరిలో రక్తహీనతతో బాధపడుతున్న ప్రతాప్‌రెడ్డి వైద్య ఖర్చులకు ఎమ్మెల్యే వైవీఆర్ రూ.10 వేల ఆర్థికసాయం చేశారు. అలాగే పామిడిలోని డీలర్ బోయ రమణ కుమార్తె ఉన్నత విద్యకు రూ.20 వేలు అందజేశారు. అదే విధంగా పట్టణంలోని 14వ వార్డు పీర్లచావిడి నిర్మాణానికి రూ.20 వేల ఆర్థికసాయం చేశారు. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన శ్రీరాములు ఇటీవల మృతి చెందడంతో ఆయన భార్య ఝాన్సీకి రూ.10 వేల సాయం అందించారు. ఆర్థికసాయం చేసిన ఎమ్మెల్యేకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.



అంగన్‌వాడీ కార్యకర్తలకు నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ఎమ్మెల్యే వైవీఆర్

అంగన్‌వాడీలకు నియామకపత్రాల అందజేత

పామిడి: గుత్తి ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా ఉద్యోగాలకు ఎంపికైన నలుగురికి సోమవారం ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి గుంతకల్లులోని తన క్యాంపు కార్యాలయంలో నియామక ఉత్తర్వులు అందజేశారు. పామిడి మండలం కాలాపురం గ్రామానికి చెందిన ఎస్.పుల్లశ్రీ,, సాయిప్రణవి, అలాగే గుత్తి పట్టణానికి చెందిన సుమలత, సలీమా బేగంకు సీడీపీఓ డిల్లీశ్వరితో కలసి నియామక ఉత్తర్వులు అందజేశారు.

పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు

గుత్తి: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ సునీలా యాదవ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం నుంచి పత్తి రైతులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. ఆర్బీకేల్లో ఈ-క్రాప్ బుకింగ్, ఈ-కేవైసీ చేసుకున్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మీడియం స్టేపుల్ పత్తి క్వింటా రూ.6,620, లాంగ్ స్టేపుల్ క్వింటా రూ.7,020 మద్దతు ధరగా నిర్ణయించడం జరిగిందన్నారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. పత్తి నాణ్యతను బట్టి ధర ఉంటుందని పేర్కొన్నారు.

పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివి

బుక్కరాయసముద్రం: పోలీసుల త్యాగాలు వెలకట్టలేనివని ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్ గంగాధర్ రావు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని జంతలూరు సమీపంలో ఉన్న 14వ ఏపీఎస్పీ పోలీసు బెటాలియన్‌లో పోలీస్ అమరవీరుల సంసస్మరణ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్పీ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్ నాగేశ్వరప్ప, ఆర్ఐలు లోకేశ్వర నాయుడు, సీతారామారావు, ఆర్ ఎస్ఐలు బెటాలియన్ పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు మెరుగైన వైద్యం



తాడిపత్రి అర్బన్ హెల్త్ సెంటర్‌లో సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రి అర్బన్: పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించినట్లు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైద్య శిబిరాన్ని సందర్శించి, అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సేవలు అందించేందుకు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, వలంటీర్లు, ఇతర వైద్య సిబ్బంది ఇంటింటికీ తిరుగుతూ సర్వేలు నిర్వహిస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉచిత వైద్య పరీక్షలతో మందులను అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి.రవి, సిబ్బంది సతీష్, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు బాబయ్య, కౌన్సిలర్ మారంరెడ్డి రంగనాథ్‌రెడ్డి, వైద్యులు, సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యర్తలు పాల్గొన్నారు.

నేడు పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు

శింగనమల: బుక్కరాయసముద్రం మండలంలోని గోవిందంపల్లి, శింగనమల మండలం తరిమెల, ఉల్లికల్లు సచివాలయ పరిధిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

506 మంది వైద్య పరీక్షలు

బుక్కరాయసముద్రం: మండల పరిధిలోని దండువారిపల్లి సచివాలయంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 506 మంది పేదలకు వైద్య పరీక్షలు చేసి, మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ భాస్కర్, ప్రత్యేక అధికారి శ్రీదేవి, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ తేజోత్స్న, జేసీఎస్ మండల కన్వీనర్ బయపరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ అంకె నరేష్ తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకూ సంక్షేమం



నార్పలలో పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

నార్పల: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలతో గడప గడపలోనూ ఆదరణ లభిస్తోందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సచివాలయం-3 పరిధిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి మండల కేంద్రానికి రాగానే డప్పు వాయిద్యాలతో బాణసంచా కాలుస్తూ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే చెప్పాలని సూచించారు. పలు సమస్యలను అధికారులకు వివరించి, వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పేదల వెంటే జగనన్న ఎప్పుడూ ఉన్నారన్నారు. పేదలను అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనే తలచి ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు తూచ తప్పకుండా నేరవేర్చిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా మేలు చేస్తుంటే పచ్చ మీడియా, దత్త పుత్రుడు ఓర్వలేక పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. మీరు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వైఎస్సార్‌సీపీ విజయాన్ని ఆపలేరన్నారు. జగనన్న వెంట ప్రజలు ఎల్లప్పుడు ఉంటారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎంఎస్ఎంఈ డైరెక్టర్ నిట్టూరు రఘునాథ్‌రెడ్డి, అనంతపురం మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ నార్పల సత్యనారాయణరెడ్డి, రాష్ట్ర నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రమీల, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపీపీ నాగేశ్వరావు, సర్పంచు మన్నీల సుప్రియ, ఎంపీటీసీ బాలనాగి భాగ్యలక్ష్మి, పార్టీ జిల్లా అధికారి ప్రతినిధి మిద్దె కుళ్లాయప్ప, కో-ఆప్షన్ సభ్యురాలు షాబీరా, ఉప సర్పంచు గవ్వల శ్రీరాములు, నాయకులు బాలనాగి శీన, బయన్న, దాడితోట బాషా, గిరక పెద్దన్న, రామకృష్ణ, ఆది పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీలకు ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

అనంతపురం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్వరలో తిరుపతి వేదికగా జరిగే రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ సోమవారం పూర్తయింది. ప్రసన్నాయపల్లి రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న గిరిష్ స్విమ్మింగ్ పూల్‌లో చేపట్టిన ఈ ప్రక్రియకు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు హాజరయ్యారు. వీరిలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఫ్రీ స్టైల్ విభాగంలో సి.విజయసింహారెడ్డి, ఎస్.శీను, సి.కేశవ్, సి.యోగానంద (ఏపీఎంస్, గార్లదిన్నె), వి.మధుసూదనాచారి, టి.నవీన్‌కుమార్, ఆర్.హేమంత్, వై.అనీష్ రెడ్డి (జెడ్పీహెచ్ఎస్, మర్తాడు) ఎంపికయ్యారు. అలాగే బ్యాక్ స్ట్రోక్ విభాగంలో డి.బహద్దూర్, వి.కృష్ణ, డి.రామ్‌చరణ్ (జెడ్పీహెచ్ఎస్, మర్తాడు), ఎం.బన్ని, కె.తేజ, టి.చరణ్‌దాస్, బి. సిద్ధార్థ, బి.రాజశేఖర్ (ఏపీఎంస్, గార్లదిన్నె), డి.ప్రవీణ్ (జెడ్పీహెచ్ఎస్, కొర్రపాడు) ఎంపికయ్యారు. ఎంపికలను ఆర్గనైజింగ్ సెక్రెటరీ జి.లక్ష్మీనారాయణ, పీడీలు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు అభినందించారు.

వైభవంగా చింతలరాయుడి చక్రస్నానం



చక్రస్నానం నిర్వహిస్తున్న అర్చకులు

తాడిపత్రి అర్బన్: చింతల వేంకటరమణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల చివరి రోజైన సోమవారం చక్ర స్నానం వేడుకగా జరిగింది. ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు వేలూరి మురళీప్రసాద్‌రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసిన సుదర్శన చక్రత్తాళ్వారును పుష్కరణిలో చక్రస్నానం చేయించారు.

సంక్షిప్త సమాచారం

పిన్నేపల్లెలో ఇరువర్గాల ఘర్షణ

యాడికి: మండలంలోని పిన్నేపల్లె గ్రామంలో సోమవారం రాత్రి కొండారెడ్డి, థాలేశ్వర రెడ్డి రెండు కుటుంబాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కొండా రెడ్డి తిడుతుండటంతో మమ్మల్ని ఎందుకు తిడుతున్నావని సుదర్శనమ్మ అడిగింది. దీంతో కోపోద్రిక్తులైన కొండారెడ్డి కట్టెతో సుదర్శనమ్మ తలపై కొట్టడంతో తీవ్ర గాయమైంది. గమనించిన సుదర్శనమ్మ బంధువు థాలేశ్వర రెడ్డి.. కొండారెడ్డిపై ఎదురు దాడికి దిగాడు. ఇరువర్గాలు కొట్టుకోవడంతో థాలేశ్వర రెడ్డి తలకు, కొండారెడ్డి చేతికి గాయాలయ్యాయి. ఎస్ఐ గురుప్రసాద్ రెడ్డి గ్రామానికి చేరుకుని క్షతగాత్రులను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఇంటర్ సర్టిఫికెట్ అందజేత

తాడిపత్రి: తాడిపత్రి రూరల్ పరిధిలోని పుట్లూరు రోడ్డు రైల్వే లెవల్ క్రాసింగ్ సమీపంలో ఉన్న గురుకుల్ పాఠశాలలో పని చేసే విజయలక్ష్మి అనే మహిళా ప్రయివేట్ టీచర్‌కు సోమవారం ఇంటర్ ఒరిజినల్ సర్టిఫికెట్ అందింది. వివరాలు.. ఇటీవల ఆమె బ్రహ్మసముద్రం కేజీబీవీలో కెమిస్ట్రీ సబ్జెక్ట్ బోధించేందుకు సీఆర్‌టీగా ఎంపికై ంది. అయితే పాఠశాల యాజమాన్యం సర్టిఫికెట్ ఇచ్చేందుకు వేధించడంతో విద్యార్థి సంఘాల ద్వారా స్పందనలో జేసీ కేతన్‌గార్గ్‌కు ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో తాడిపత్రి ఎంఈఓ నాగరాజు పాఠశాల నుంచి ఇంటర్ ఒరిజనల్ సర్టిఫికెట్‌ను తెచ్చి ఆమె కుటుంబ సభ్యులకు అందజేశారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

యాడికి: గుజరాత్ నుంచి టైల్స్ లోడుతో చెన్నై వెళ్తున్న ఓ లారీ మండలంలోని రాయలచెరువు-తాడిపత్రి రహదారిలో మోడల్ స్కూల్ సమీపంలో సోమవారం ఉదయం బోల్తా పడింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. డ్రైవర్ కునుకు తీయడంతో ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు.

టెక్ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

తాడిపత్రిటౌన్: తాడిపత్రిలోని టెక్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై నట్లు ప్రిన్సిపాల్ ఈవీ సుబ్బారెడ్డి తెలిపారు. సోమవారం కళాశాల ప్రాంగణంలో బ్లూ డయానో సీ సర్వీసెస్ వారి ఆధ్వర్యంల జాబ్‌మేళా నిర్వహించారు. ఈసీఈ విభాగం నుంచి ఇద్దరు, ట్రిపుల్‌ఈ విభాగం నుంచి ఒక్కరు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరికి సంవత్సరానికి రూ.4 లక్షల ప్యాకేజీ ఉంటుందని ప్లేస్‌మెంట్ అధికారి జుబిర్ తెలిపారు. ఉద్యోగాలు దక్కించుకున్న విద్యార్థులను కళాశాల సెక్రటరీ సురేష్‌రెడ్డి అభినందించారు.

తాగునీటి సమస్య తలెత్తనీయొద్దు

గుత్తి: మున్సిపాలిటీలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వై. వెంకటరామిరెడ్డి మున్సిపల్ అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ అధికారులు, వాటర్ వర్క్స్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోర్లు ఏర్పాటు చేసైనా నీటి ఎద్దడిని నివారించాలన్నారు. ప్రజలు ఎవరూ నీటి కోసం ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాసులు, చైర్ పర్సన్ వన్నూర్‌బీ పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా విజయ్‌కుమార్

గార్లదిన్నె: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్‌గా విజయ్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఈయన రాప్తాడు మండలం నుంచి గార్లదిన్నెకు బదిలీపై వచ్చారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె: మండల కేంద్రానికి చెందిన వాసు అనే వ్యక్తి సోమవారం విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడ్ని 108లో అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వాసు ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

నేడు సచివాలయ ప్రారంభోత్సవం

యాడికి: మండలంలోని రాయలచెరువులో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం-2ను మంగళవారం ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రారంభిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు సోమవారం ఓ ప్రకటనలో తెలిపాయి.

తాడిపత్రి తహసీల్దార్‌గా అలెగ్జాండర్

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మండల తహసీల్దార్‌గా అలెగ్జాండర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన మునివేలు బదిలీపై రాప్తాడుకు వెళ్లారు.

చురుగ్గా అండర్ డ్రైనేజీ మరమ్మతులు

తాడిపత్రి అర్బన్: పట్టణంలో వివిధ ప్రాంతాల్లో అండర్ డ్రైనేజీ మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం 13వ వార్డులో అండర్ డ్రైనేజీ పనులను వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్, జిల్లా వికలాంగుల సంఘం అధ్యక్షుడు రంగనాథ్‌రెడ్డి పరిశీలించారు. వీలైనంత త్వరగా పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

మిరప సాగుతో లాభాలు



మిరప పంటను పరిశీలిస్తున్న అనంతపురం ఉద్యాన సహాయ సంచాలకులు నరసింహరావు

పామిడి: మండలంలోని ఎద్దులపల్లి, రామగిరి, అనుంపల్లి, ఖాదర్‌పేట గ్రామాల్లో సోమవారం అనంతపురం ఉద్యాన సహాయ సంచాలకులు బీఎంవీ నరసింహరావు పర్యటించారు. మిరప సాగులో అధిక దిగుబడి సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. అలాగే ఖాదర్‌పేట గ్రామ సచివాలయంలో రైతుల సోషల్ ఆడిట్ జాబితాను పరిశీలించారు. గ్రామంలో పామిడి రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సంఘం లిమిటెడ్ సంఘం ద్వారా నిర్మాణంలో ఉన్న కలెక్షన్ సెంటర్‌ను సందర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కాయల మహేష్, మాజీ సర్పంచ్ బయపరెడ్డి, హార్టికల్చర్ ఆఫీసర్ మిత్రవింద మాధవి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ఎస్.భవాని

గుంతకల్లుటౌన్: పట్టణంలో తాగునీటి ఎద్దడి నెలకొనే అవకాశముందంటూ కొన్ని పత్రికల్లో వచ్చిన వార్తల్లో వాస్తవం లేదు. హంద్రీనీవాకు నీరు విడుదలైన వెంటనే రెండు రిజర్వాయర్లలోకి నీటి పంపింగ్ ప్రారంభించాం. రెండు ట్యాంకుల్లో 5700 మి.లీ నీటిని నిల్వ ఉంచాం. ప్రస్తుతం సరఫరా చేస్తున్న ప్రకారం చూసుకున్నా 9 నెలలకు సరిపడా నీరు నిల్వ ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవాని, కమిషనర్ మల్లికార్జున తెలిపారు. సోమవారం సాధారణ కౌన్సిల్ సమావేశం జరిగింది. కౌన్సిలర్లు రంగమ్మ, లింగన్న, చెన్నమ్మ, మెహరున్నీసా, కృపాకర్, చాంద్‌బాష, చాముండేశ్వరి తదితరులు ఆయా వార్డుల్లో నీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. చెడిపోయిన స్పాట్ డెలివరీ ట్యాంక్‌ల మోటార్లను రిపేరీ చేయించాలన్నారు. వారంలోపు సమస్య పరిష్కరిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. కౌన్సిలర్ సుధాకర్ మాట్లాడుతూ షికారీ కాలనీలో డ్రైనేజీ, రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు టెండర్లు ముగిసినా కాంట్రాక్టర్లతో పనులు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కౌన్సిలర్ షరీఫ్ మాట్లాడుతూ ముస్లిం శ్మశానవాటికకు వాచ్‌మెన్ నియమించాలని కోరారు. పాతమున్సిపల్ గర్ల్స్ హైస్కూల్ ఆవరణలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణంపై కౌన్సిల్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. సాధారణ, గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో పలు వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

ఎడ్ల బండిని ఢీకొన్న లారీ



ధ్వంసమైన ఎడ్ల బండి

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డి గ్రామ శివారులో 44వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ఎడ్ల బండిని వెనుక నుంచి లారీ ఢీకొన్న ప్రమాదంలో రైతు చిన్ని నారాయణ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వన్నేదొడ్డి గ్రామానికి చెందిన రైతు చిన్న నారాయణ వ్యవసాయ పనుల నిమిత్తం వేకువజామున పొలానికి వెళ్లాడు. పని ముగించుకుని ఎడ్ల బండిలో తిరిగి గ్రామానికి బయలుదేరాడు. గ్రామ సమీపంలో హైదరాబాద్ వైపునకు వెళ్తున్న కంటైనర్ లారీ వెనుక నుంచి వేగంగా వచ్చి ఎడ్ల బండిని ఢీకొంది. రైతు చిన్న నారాయణతో పాటుగా రెండు ఎద్దులు తీవ్రంగా గాయపడ్డాయి. గాయపడిన రైతును 108లో గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్సలకు అనంతపురం తరలించారు.లారీని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

ఆటో బోల్తా: ఆరుగురికి తీవ్ర గాయాలు

గుత్తి: పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం ఆటో బోల్తా పడింది. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న కర్నూలు జిల్లా మద్దికెరకు చెందిన దుగ్గెన్న, ఉజ్జూరప్ప, చిన్న అంబయ్య, రవీంద్ర, లింగప్ప, రమేష్ తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. మద్దికెరకు చెందిన ఆరుగురు ఆటోలో పనిపై సోమవారం ఉదయం పామిడికి బయలుదేరారు. గేట్స్ కాలేజీ సమీపంలోకి చేరుకోగానే ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికులు గమనించి క్షతగాత్రులను 108 అంబులెన్స్ ద్వారా గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అనంతపురంలోని జీజీహెచ్‌కు తీసుకెళ్లారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

బుక్కరాయసముద్రం: మొక్కజొన్న పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం రెడ్డిపల్లి కేవీకే, రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రబీలో మొక్కజొన్న సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. మొక్కజొన్న పంట లాభదాయకంగా ఉంటుందన్నారు. కత్తెర పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎకరాకు 10-15 చొప్పున లింగాకర్షణ బుట్టలు అమర్చుకోవాలన్నారు. రిలయన్స్ ఫౌండేషన్ మేనేజర్ ప్రకాష్ పాల్గొన్నారు.